జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
బుధవారం | 9 | సెప్టెంబర్ | 2026 | పేజీలు : 7

## గణేష్ మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ముందస్తు సమాచారం ఆధారంగా సమర్థవంతమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ ప్రణాళిక
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** గణేష్ మండపాల ఏర్పాటు,నిర్వాహకులు, కమిటీ సభ్యులు,మండపం ప్రాంతం, నిమజ్జన వాహనాలు తదితర వివరాలను నిర్వాహకులు policepor- tal.tspolice.gov.in ఆన్‌లైన్ పోర్టల్‌లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు.తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్‌లో 2026 గణేష్ విగ్రహాల ఏర్పాటు,ఊరేగింపుకు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉందన్నారు. మండపాల వివరాలు ముందుగానే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటం ద్వారా ప్రాంతాల వారీగా అవసరమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన మార్గాల ప్రణాళిక,భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు.గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ కోరారు.




## గోదావరి, సాగర్ జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలి
- జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- పల్లెగూడెం ఎన్ఎస్పి కాలువ పునరుద్ధరణ పనులు, ఏ.వి. పాలెం డీప్‌కట్ వద్ద జలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సాగర్, గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతతో కాపాడుకోవాలని, రైతులు నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్పీ కాల్వ లింకు కెనాల్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగర్ జలాల ప్రవాహాన్ని పరిశీలించి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీటి సరఫరా జరిగే కాలువ, తూము మరమ్మత్తు పనుల పై మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత కాలువ పరిస్థితి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువు వరకు ఉన్న దూరం, నీటి సాఫీగా ప్రవహించేందుకు అనువైన పరిస్థితులు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు.సాధ్యమైనంత త్వరితగతిన కాలువ, తూము పునరుద్ధరణ

మిగతా 2 లో...



## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### డీఎంహెచ్ఓ డా. డి. రామారావు

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి :** ఖమ్మం నగరంలోని యలమద్ది ఆసుపత్రిని మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. డి. రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు,ప్రస్తుతం చికిత్స పొందుతున్న రోగుల కేస్ షీట్లు, మెడికల్ రిపోర్టులను సమగ్రంగా సమీక్షించారు.అనంతరం ఆసుపత్రిలోని స్కానింగ్ సెంటర్ రికార్డులు, ఫారమ్-ఎఫ్ రిజిస్టర్లను తనిఖీ చేసి, ప్రైవేట్ ఆసుపత్రులు,స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం:గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం తీవ్రమైన నేరమని, ఇటువంటి పరీక్షలు నిర్వహించిన వారు, చేయించుకున్న వారు ఇద్దరూ సమానంగా శిక్షార్హులని హెచ్చరించారు. ఈ హెచ్చరికలకు సంబంధించిన సైన్ బోర్డులను ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్లలో రోగులకు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా

మిగతా 2 లో...

## శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న 400 బుల్లెట్ సైలెన్సర్ల ధ్వంసం

- రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను తొక్కించి ధ్వంసం చేసిన ట్రాఫిక్ పోలీసులు
- అడిషనల్ డీసీపీ రామానుజం



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న బుల్లెట్ ద్విచక్ర వాహనాల సైలెన్సర్లపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ డీసీపీ రామానుజం తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్ సైలెన్సర్లను పోలీస్ హెడ్ క్వాటర్స్ లో

మిగతా 2 లో...

## బీఆర్ఎస్ పోరుబాట

- మహిళా ఎమ్మెల్యేలపై దాడిని ఖండిస్తూ నల్లజెండాలతో భారీ ర్యాలీ



**వేంసూరు సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి** తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ప్రభుత్వ దాడిని ఖండిస్తూ ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో మర్లపాడు పార్టీ కార్యాలయం నుంచి వేంసూరు వరకు నల్లజెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో మహిళలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ నేతలు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ

మిగతా 2 లో...

# తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ మండల నాయకులు





- **మండల అధ్యక్షుడు దేవ్ సింగ్ ఆధ్వర్యంలో నిరసన**

**రఘునాథపాలెం: ప్రజాజ్యోతి** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని రఘునాథ పాలెం మండల అధ్యక్షుడు దేవ్ సింగ్ మండిపడ్డారు.స్పీకర్పై ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మండల కేంద్రం లోనీ యాపిల్ చౌరస్తాలో మంగళ వారం మండల అధ్యక్షులు,దేవ్ సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తాతా మధు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు ఈ కార్యక్రమంలో ఏఎంసి మార్కెట్ చైర్మన్ హనుమంతరావు, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. ..అత్యున్నత స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై బాధ్యతారహితంగా, అవమాన కరంగా మాట్లాడడం బీఆర్ఎస్ పార్టీ అహంకారానికి నిదర్శనమన్నారు. తాతా మధు తక్షణమే స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బీఆర్ఎస్ నాయకత్వం కూడా తగిన చర్యలు చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోటేష్ నాయక్, సర్పంచ్ గాజుల కృష్ణారావు, కిలారు వెంకటరమణ, రామ్మూర్తి , చెరుకూరి పూర్ణ , బోయిన పల్లి లక్ష్మణ్ , రవీందర్ ,రమణగా, కొంటెముక్కుల నాగేశ్వరరావు , రమణ సుధాకర్ , రమేష్ నాయక్ ,అరవి కట్ల సుధీర్ దొంత, అక్కెనపల్లి ఉపేందర్, బోయినసత్యం , బానోతు ఉపేందర్ , లింగాల మహేష్, దొంత బోయిన శ్రీను,సర్పంచులు నవీన్ నాయక్ చిన్నయ్య నర్సిరెడ్డి ,మూడు చిన్న నాయక్ సిద్దయ్య ఉపసర్పంచ్ ఆదూరి రాణి మహిళ నాయకురాలు ఎస్ కే జరీనా, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి, సాగర్ జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలి



(మొదటి పేజీ తరువాయి...)

పనులను పూర్తిచేయాలని,త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ,ఖమ్మం రూరల్ మండలం పరిధిలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పై ఆరా తీశారు.నోటీసులు అందుకున్న ఓటర్లు ఏ ఒక్కరు మిస్ కాకుండా ప్రతి ఒక్కరిని హియరింగ్ కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు సైతం చర్యలు చేపట్టాలన్నారు.అనంతరం రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం డీప్కట్ వద్ద జలాల పరిస్థితిని పరిశీలించారు. అధికారులు,ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ,వివిధ కాలువలు,రెగ్యులేటర్లు,చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి, సాగర్ నుంచి తరలిస్తున్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.అందుబాటులో ఉన్న నీటిని సమర్ధవంతంగా వినియోగించాలని, త్రాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రాధాన్యత క్రమంలో నీటిని వినియోగించాలని అన్నారు.వివిధ కాలువలు,రెగ్యులేటర్లు,చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.నీటి ప్రవాహాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేయాలని, నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇర్రిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్,వైరా ఈఈ బాబురావు,ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్,తహసీల్దార్లు వినయేందర్ రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్ తో పాటు పలువురు మున్సిపల్, ఇరిగేషన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



(మొదటి పేజీ తరువాయి...)

ప్రదర్శించాలని,వైద్యుల వివరాల బోర్డులు: ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యుల పేర్లు,విద్యార్హతలు,రిజిస్ట్రేషన్ నంబర్లు,ఆసుపత్రిలో అందుబాటులో ఉండే సమయాల వివరాలను రిసెప్షన్ వద్ద డిస్‌ప్లే బోర్డుల ద్వారా ప్రజలకు తెలిసేలా ఉంచాలని,బయో–మెడికల్ వ్యర్థాల నిర్వహణ: పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనలకు అనుగుణంగా బయోమెడికల్ వ్యర్థాల సేకరణ,విభజన,డిస్పోజల్ ప్రక్రియలను పక్కాగా పాటించాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఆసుపత్రి లపై చర్యలు ఉంటాయని,రిజిస్ట్రేషన్,ప్రమాణాలు: ప్రైవేట్ ఆసుపత్రులు మరియు నర్సింగ్ హోమ్‌లు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నిర్దేశించిన నిబంధనలు,ప్రమాణాలను క్రమశిక్షణతో తూచా తప్పకుండా పాటించాలని, సరైన అనుమతులు లేకుండా లేదా అర్హత లేని సిబ్బందితో సేవలు అందిస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలు తప్పవని,ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఏ ఆసుపత్రినీ ఉపేక్షించేది లేదని,జిల్లావ్యాప్తంగా నిరంతర ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని డా. డి. రామారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది సాయి కృష్ణ,ఒ.ఎస్.ఎలిమధ్య హాస్పిటల్ నుంచి డాక్టర్ రాజేష్ మేనేజ్మెంట్ విభాగం గురించి సురేష్ పాల్గొన్నారు.

## శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న 400 బుల్లెట్ సైలెన్సర్ల ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి...)

రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలకు కంపెనీ నిర్దేశించిన ఒరిజినల్ సైలెన్సర్లనే వినియోగించాలని, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చుకుని ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని సూచించారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో వాహనాలు నడపడం,నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్చడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజల ప్రశాంతత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శబ్ద కాలుష్య నియంత్రణకు పోలీసుల చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలిపారు.గతంలో 1654 బుల్లెట్ సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొ న్నారు.

## ముత్తారంలో పోషణ మాసం కార్యక్రమం



**ముదిగొండ సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి )** ముదిగొండ మండలం ముత్తారం గ్రామపంచాయతీ పరిధి అంగన్వాడి కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు సందర్భంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోషకాహార లోపం వల్ల పిల్లలు బరువు తగ్గుదల, పిల్లలు తీసుకునే ఆహార అలవాట్ల పద్ధతి వివరించడం జరిగింది. అదేవిధంగా పిల్లలు బరువు పెరగడానికి తీసుకోవాల్సిన పోషక ఆహార పదార్థాలు గురించి వివరించడం జరిగింది. పోషకాహార లోపం వల్ల పిల్లలు వ్యాధుల బారిన పడకుండా తల్లులు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లంజపల్లి మమత, పంచాయతీ సెక్రెటరీ వీరబాబు, ఆశ వర్కర్ మూల పుష్ప, అంగన్వాడీ టీచర్స్ జానకి, రేణుక, అంగన్వాడి ఆయా, తల్లులు తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ పోరుబాట

(మొదటి పేజీ తరువాయి...)

ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చకు రాకుండా పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ శాసనసభ, స్పీకర్ పదవి పట్ల పూర్తి గౌరవం ఉందని, స్పీకర్‌ను లేదా శాసనసభను అవమానించడం తమ పార్టీ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు.ప్రతిపక్షాలకు ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ఉందని ఆయన అన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేతలు నల్లదుస్తులతో నిరసనలు తెలిపిన సందర్భాలను ప్రస్తావిస్తూ, తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు నల్లదుస్తులతో నిరసన తెలపడానికి ఎందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారన్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలు అమలు కాలేదని సండ్ర విమర్శించారు. 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి–షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం, పేదలకు ఇళ్లు వంటి హామీలను నెరవేర్చాలని కోరారు.రైతు భరోసా, రైతు బీమా, యూరియా కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు, ఎన్నికల హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటం ఇక్కడితో ముగియదని, రానున్న రోజుల్లో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.మండుటెండను సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో నిరసన కార్యక్రమానికి తరలివచ్చిన మహిళలు, కార్యకర్తలు, అభిమానులకు సండ్ర వెంకట వీరయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా పంచాయతీ అధికారి వినోద్ ఆకస్మిక తనిఖీ



**ముదిగొండ సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి )** మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం,సువర్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో ) వినోద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా పంచాయతీ పరిధిలోని రికార్డులు, రిజిస్టర్లు, పన్ను వసూళ్ల వివరాలు, నగదు పుస్తకాలను ఆయన నిశితంగా పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, తాగు నీటి సరఫరా తీరుపై ఆయన ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వం వహించరాదని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల ఇంచార్జి ఎంపీవో రామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి దేగల సురేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంట్ వద్ద షార్ట్ సర్క్యూట్ ప్రమాదం

- **కంట్రోల్ యూనిట్ కు ప్రత్యేక రూమ్ ఏర్పాటు చేయాలి ఐఎన్టియుసి కోటి**



**సత్తుపల్లి సెప్టెంబర్ 08(ప్రజా జ్యోతి)** సోలార్ ప్లాంట్ వద్ద షార్ట్ సర్క్యూట్ అవ్వటంతో,ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణం నష్టం జరగలేదని, దీనిపై పటిష్టమైన చర్యలు తీసుకొని ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఐఎన్టియుసి నాయకులు వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వర రావు జీఎం వెంకటాచారి తో వివరించారు. కంట్రోల్ యూనిట్లను ప్రత్యేక రూమ్ కు మార్చాలని కోరిన ఐఎన్టియుసి ఏరియా వైస్ ప్రెసిడెంట్ నిన్న సోలార్ పవర్ సిస్టమ్ వద్ద జరిగిన విద్యుత్ ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. సోలార్ ప్యానెల్స్ నుండి వచ్చే డి సి (డైరెక్ట్ కరెంట్) వైరింగ్ కంట్రోల్ బాక్స్ విభాగంలో తీవ్రమైన షార్ట్ సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా భారీ మంటలు చెలరేగాయి.ఈ ప్రమాద తీవ్రతకు కంట్రోల్ యూనిట్, వైరింగ్ పరికరాలు పూర్తిగా దగ్ధమై, గోడలు నల్లబడి బూడిద మిగిలింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం త్రుటిలో తప్పింది. గతంలో కూడా సరిగ్గా ఇదే తరహా లోపంతో ప్రమాదం జరిగిందని, సంబంధిత వర్గాలు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే నిన్న మళ్లీ ఈ ఘటన పునరావృతమైందని ఆందోళన వ్యక్తమవుతోంది. నాణ్యత లేని వైరింగ్, లూజ్ కనెక్షన్లు లేదా టెక్నికల్ లోపాలే ఇందుకు కారణమని, ప్రాథమికంగా భావిస్తున్నారు. జీఎం వెంకటాచారి దృష్టికి తీసుకెళ్లిన కోటి. ఇలాంటి సంఘటనలు కాలనీలో ఈ మధ్య కాలంలో తరచుగా సంభవిస్తుండటంతో కాలనీ వాసులు తీవ్ర భయ బ్రాంతులకు గురవుతున్నారు.ఈ ప్రమాద విషయం తెలిసిన వెంటనే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన తక్షణమే జిఎం తో మాట్లాడి,ఘటన తీవ్రతను సమగ్రంగా వివరించారు. కార్మికులు, ఉద్యోగుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని, పదే పదే ఇలాంటి ప్రమాదాలు జరగడం సంబంధిత కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ముఖ్యంగా, ఉద్యోగులు,కార్మికులు నిరంతరం రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఈ కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్ర ప్రాణాపాయం పొంచి ఉందని ఆయన జీఎం గారి దృష్టికి తెచ్చారు. కావున ప్రస్తుతం ఉన్న కంట్రోల్ యూనిట్లను తక్షణమే అక్కడి నుండి తొలగించి, కింద ప్రత్యేకంగా ఉన్న 'కంట్రోల్ ప్యానెల్ యూనిట్ రూమ్' లోకి షిఫ్ట్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని గట్టిగా కోరారు. అదేవిధంగా నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన జనరల్ మేనేజర్ వెంకటాచారి: ఐ ఎన్ టి యు సి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు లేవనెత్తిన భద్రతా అంశాలపై జనరల్ మేనేజర్ వెంకటాచారి గారు అత్యంత సానుకూలంగా స్పందించారు. భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేస్తూ కంట్రోల్ యూనిట్లను ప్రత్యేక కంట్రోల్ రూమ్ కు తరలించే అంశాన్ని పరిశీలించి వెంటనే తగిన ఆదేశాలు జారీ చేస్తాం. ఈ ప్రమాద ఘటనపై పూర్తి విచారణ జరిపించి, నాణ్యతా లోపాలు లేదా నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నూరు శాతం భద్రతా ప్రమాణాలు నిర్ధారించుకున్న తర్వాతే తదుపరి పనులు ముందుకు తీసుకెళ్తాం" అని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పకడ్బందీ నివారణ చర్యలు చేపట్టాలని కార్మిక వర్గాలు కోరుతున్నాయి. ఈ సంఘటన పరిశీలించిన వారిలో బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, పిట్ సెక్రెటరీలు షణ్ముఖ చారి, శ్రీధర్, బిట్టి అశోక్ కుమార్,రాజేష్ తదితరులు పరిశీలించారు.

## దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- **డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,ఖమ్మం ఆధ్వర్యంలో ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలోదివ్యాంగుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస పాల్గొని దివ్యాంగులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు,ప్రభుత్వ సంక్షేమ పథకాలు,ఉపాధి అవకాశాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,దివ్యాంగులు స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగజన్ కౌశల్ వికాస్ పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి అవకాశాలను,దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన అవకాశాల గురించి వివరించారు.దివ్యాంగుల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకొని సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, అర్హులైన దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం న్యాయ సలహా అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎ. ప్రమీల, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు, సంబంధిత శాఖ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

## అశ్రిత్ గ్రూప్ వెబ్ డెవలపర్ పోస్టులకు ఎంపికైన 6గురు యస్.బి.ఐ.టి. విద్యార్థులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** బెంగుళూరు కేంద్రంగా నడపబడుతున్న ప్రముఖ సంస్థ అశ్రిత్ గ్రూప్‌లో తమ కళాశాలకు చెందిన 6గురు విద్యార్థులు వెబ్‌డెవలపర్‌గా ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో విద్యార్థులనుద్ధేశించి మాట్లాడుతూ లేఆఫ్‌ల కాలంలో కూడా తమ విద్యార్థులకు ఉద్యోగాలు అందించడంలో తమ వంతు కృషి చేస్తున్నామని, దొరికిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు.సంస్థలో ఈకామర్స్ విభాగంఅశ్రిత్ ఫ్రెష్,అశ్రిత్ ఇన్ఫోటెక్, సన్‌టెక్ సొల్యూషన్స్ వంటి ఐ.టి., ఐ.టి. అనుభంద సంస్థలు గ్రూప్‌గా కలిగి నిర్వహిస్తున్న అశ్రిత్ గ్రూప్‌లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం తమ కళాశాలకు గర్వకారణమని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా జి . ధాత్రి తెలిపారు. వెబ్‌డెవలపర్ నియామకాలకు గాను మొదట ఆన్‌లైన్ అస్సెస్‌మెంట్, టెక్నికల్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ మరియు హెచ్.ఆర్ ద్వారా 6గురుని ఎంపిక చేసినట్లు తెలిపారు.ఎంపికైన విద్యార్థులకు 3.8 నుండి 4.5 లక్షల వార్షిక ఆదాయం అందుతుందని కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు.2019లో స్థాపించబడి ఐటి, బిజినెస్ సొల్యూషన్స్, ఈకామర్స్ వంటి విభాగాలలో సేవలందిస్తూ విస్తరిస్తున్న అశ్రిత్ గ్రూప్‌లో తమ విద్యార్థులు ఉద్యోగం సంపాదించటంలో తమ కళాశాలలోని నిరంతర కోడింగ్,అప్టిట్యూడ్,ఎంప్లాయబిలిటి స్కిల్స్‌ల శిక్షణ ఎంతగానో తోడ్పడిందని కళాశాల ప్రిన్సిపాల్ డా జి.రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అశ్రిత్ గ్రూప్ సి.ఈ.ఓ. యన్.ఫారూక్, మేనేజింగ్ డైరెక్టర్ యన్. పల్లవి, సీనియర్ హెచ్.ఆర్. సంకీర్తనతో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. డా యన్. సవిత, డా జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలు

**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని వేమిరెడ్డి రెడ్డి వెంకట్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం మండల స్థాయి పాఠశాలల అండర్ 17 బాల బాలికల కబడ్డీ,ఖో –ఖో, వాలీబాల్ స్పోర్ట్స్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి బి. మురళీమోహన్, సర్పంచ్ కొంగర నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. కోకో అండర్ 17 బాలికల విభాగంలో భీమవరం వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి పాఠశాల రాజుపాలెం గెలుపొందాయి. అండర్ 17 బాలికల కబడ్డీ విభాగం లో వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భీమవరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనవోలు జట్లు ఫైనలకు చేరుకున్నాయి, వాలీబాల్ అండర్ 17 బాలురు విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామన్నపాలెం, ప్రగతి రామన్నపాలెం జట్లు ఫైనల్ కు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అనుమోలు వెంకటకృష్ణారావు, శీలం శ్రీనివాస్ రెడ్డి, కొమ్మినేని కృష్ణారావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వరరావు, పీఆర్టి యూనియన్ అధ్యక్షుడు బొగ్గుల మదన్మోహన్ రెడ్డి, టిపిటి ఎఫ్ అధ్యక్షులు ముత్తయ్య, ఆర్గనైజర్ నరాల సాంబశివారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మారబత్తుల జమలయ్య, గూడూరు సత్యనారాయణ రెడ్డి, ఎండి అజీమ్, మారబత్తుల నాగేశ్వరరావు, తలపరెడ్డి గోపిరెడ్డి, టి త్రిపుర, రవికుమార్, వేణు, జహీరా, పాఠశాలకు ఉపాధ్యాయులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం వేడుకలు



**పాలేరు ఆర్.సి సెప్టెంబర్ 08 ప్రజా జ్యోతి** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం కూసుమంచి మండలంలో ఎస్.ఈ.ఆర్.ఆర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కూసుమంచి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలని, అక్షరాస్యత ప్రతి ఒక్కరి హక్కు అని పేర్కొన్నారు. అక్షరాస్యత ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఈ.ఆర్.ఆర్ సిబ్బంది, ఏపిఎం,సీసీలు, కూసుమంచి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మెరుగైన పట్టు పురుగుల పెంపక సాంకేతికతలపై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం




**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మేరా రేషమ్ మేరా అభిమాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా, కేంద్ర పట్టు మండలి, బెంగళూరు మరియు తెలంగాణ రాష్ట్ర సెరికల్చర్ శాఖ ఆధ్వర్యంలో నరసింహాపురం గ్రామంలో మెరుగైన పట్టు పురుగుల పెంపక సాంకేతికతలపై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.సుమారు సుమారు 30 మంది పట్టు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెరుగైన పట్టు పురుగుల పెంపక పద్ధతులు మరియు మల్బరీ తోటల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో డా. జి. సుబ్రహ్మణ్యం, సీనియర్ సైంటిస్ట్, కేంద్ర పట్టు మండలి, బెంగళూరు; అర్రా ముత్యాలు, మాజీ డిప్యూటీ డైరెక్టర్, తెలంగాణ సెరికల్చర్ శాఖ కామేశ్వరరావు, సెరికల్చర్ ఆఫీసర్, ఖమ్మం దేవరాజు, అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షులు, రంగారెడ్డి, సీనియర్ పట్టు రైతు; మరియు వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ పట్టు రైతు తదితరులు పాల్గొన్నారు.రైతులకు మెరుగైన పట్టు పురుగుల పెంపక సాంకేతికతలు మరియు శాస్త్రీయ మల్బరీ తోటల నిర్వహణ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ పద్ధతులను పాటించడం ద్వారా పట్టు పురుగుల ఆరోగ్యం, కోకూన్ నాణ్యత మరియు ఉత్పాదకతను మెరుగుపరచవచ్చని వివరించారు.మేరా రేషమ్ మేరా అభిమాన్ 2.0 ద్వారా ఆధునిక సెరికల్చర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, మెరుగైన పద్ధతులను అవలంబించేలా ప్రోత్సహిస్తున్నట్లు వారు తెలిపారు.

## పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణ చర్యలు చేపట్టాలి

- మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి





**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** కూసుమంచి మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి జీళ్ళచెరువు గ్రామంలో కపాస్ కిసాన్ పథకంలో భాగంగా వేసిన పత్తి పంటను సందర్శించి, పంటలో రసం పీల్చే పురుగులైన పచ్చ దోమ, తామర పురుగులు , పేనుబంక పురుగులు తెల్లదోమ ఉనికిని పరిశీలించారు. రైతులు పంటను క్రమం తప్పకుండా పరిశీలించి, పురుగుల ఉధృతి పెరగకముందే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని నివారించి, కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. పురుగు ఉధృతి ఆర్థిక నష్ట పరిమితిని దాటినప్పుడు, సిఫారసు చేసిన మందులనువాడాలని సూచించారు.పచ్చ దోమ,తామరపురుగుల నివారణకు అసిటామిప్రిడ్ 20 SP @ 0.2 గ్రాములు /లీటరు నీటికి థయామెథోక్సం 25 WG @ 0.2 గ్రాములు /లీటరు,తెల్లదోమ నివారణకు ప్రొఫెనోఫోస్ 50 EC @ 2.0 మి.లీ. /లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.పురుగుమందులను అనవసరంగా లేదా అధిక మోతాదులో వాడకూడదనీ, ఒకే చర్యా విధానం కలిగిన మందులను పదేపదే ఉపయోగించకుండా, అవసరాన్ని బట్టి వేర్వేరు చర్యా విధానాల మందులను మార్చి మార్చి ఉపయోగించాలని సూచించారు. పిచికారీ సమయంలో ఆకుల కింది భాగం వరకు మందు చేరేలా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు .

## ఉద్యమిస్తేనే డిమాండ్లను సాధించుకో గలం జేఏసీ నాయకులు



**సత్తుపల్లి సెప్టెంబర్08(ప్రజా జ్యోతి )**మూడేళ్ళు ఓపికగా సహనంతో వేచిచూశాము.ఇంకా రెండేళ్ళు ఎదురు చూడమని ముఖ్యమంత్రి అంటున్నారు.ఇక వేచి చూసే అవకాశం లేదు.సమస్యలు పరిష్కరించేయక పోతే ఉద్యమ కార్యాచరణ అమలు చేస్తామని,తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ల అసోసియేషన్ టి.జి. ఈ. జే. ఏ. సి.జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.మంగళవారం సత్తుపల్లి లోని కార్యాలయంలో కేశవరెడ్డి అధ్యక్షతన జే. ఏ. సి. సమావేశం జరిగింది.ఇందులో జిల్లా నాయకులతో పాటు సత్తుపల్లి డివిజన్ లోని వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన హైదరాబాద్ లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని, అందుకు అధికసంఖ్యలో ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.మూడేళ్ళు గడిచినా ముఖ్యమంత్రి నుంచి స్పష్టమైన హామీ దొరకలేదని,ఇంకా రెండేళ్ళు ఎదురు చూడమనడం బాధ్యతా రాహిత్యమని, తమ అవేదన వ్యక్తం చేశారు.ఉద్యమ కార్యాచరణ అమలు చేయకపోతే మన సమస్యలు పరిష్కారం కావని తెలియచేశారు.సత్తుపల్లి లో జరిగిన ఉద్యమ సన్నాహక సమావేశంలో ఉద్యోగ ఉపాధ్యాయ, రిటైర్డ్ సంఘాల నాయకులు అద్భుతమైన స్పందన తెలియ చేశారు.ఇక రాజీపడే ప్రసక్తి లేదని ఖచ్చితంగా ఉద్యమంలో పాల్గొంటామని తమ స్పందన తెలిపారు.జిల్లా జే ఏ సి నాయకులుగుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, టి ఎస్ జి ఆర్ ఈ ఏ జిల్లా నాయకులు సుబ్బయ్య,వేణు,దుర్గాప్రసాద్, జైపాల్,కృష్ణారావు,వీరన్న, సత్తుపల్లి ప్రాంత నాయకులు ప్రకాశరావు,వైకుంఠరావు,బాలనాగేశ్వరరావు, సుధాకరరెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, సూరయ్య, చింతకాయల కృష్ణ,రెవిన్యూ, మెడికల్ ,ఇరిగేషన్, గెజిటెడ్ ,వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళతో.. మహిళల ఆరోగ్యానికి భరోసా

- ముందస్తు పరీక్షలతో మహమ్మారిని ముందే గుర్తింపు
- మంగళ, గురువారాల్లో ప్రత్యేక వైద్య సేవలు.. వేలాది మంది మహిళలకు అండగా ప్రభుత్వ వైద్యం
- మహిళలు మీ ఆరోగ్యం కోసం రెండు రోజులు మర్చిపోవద్దు
- 260 మందిలో వివిధ రకాల క్యాన్సర్ గుర్తింపు చికిత్స, రిఫరల్, ఫాలోఅప్‌తో నిరంతర పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ నిరంతర పర్యవేక్షణలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, పిల్లల సంరక్షణ, ఇంటి బాధ్యతల్లో నిత్యం నిమగ్నమయ్యే మహిళలు చాలా సార్లు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం మరిచిపోతుంటారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యను కూడా నిర్లక్ష్యం చేస్తూ.. తీవ్రమైన సమస్యగా మారిన తర్వాత ఆసుపత్రిని ఆశ్రయించే పరిస్థితులు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే సకాలంలో చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం ఖమ్మం జిల్లాలో మహిళల ఆరోగ్యానికి ఒక రక్షణ కవచంలా నిలుస్తున్నది.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పర్యవేక్షణలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సర్వజన aasupathrilo ప్రభుత్వ వైద్య విభాగం సమర్ధవంతంగా అమలు చేస్తున్నది. జిల్లాలోని సర్వజన ఆసుపత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి మంగళవారం, గురువారం నిపుణులైన మహిళా వైద్యులచే మహిళలకు ప్రత్యేకంగా ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఓపీ నమోదు నుంచి స్క్రీనింగ్, పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, అవసరమైన ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫరల్, చికిత్స అనంతరం ఫాలో అప్ వరకు సేవలను అనుసంధానం చేస్తున్నారు.ఇంటి దగ్గర్లోనే సమగ్ర ఆరోగ్య పరీక్షలుమహిళలు తమ ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్య కేంద్రాల్లోనే ఆరోగ్య మహిళ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఓపీ నమోదు, ఆన్‌లైన్ డేటా నమోదు, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరాన్ని బట్టి వివిధ రకాల అధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా 35 సంవత్సరాలు పైబడిన మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.మామోగ్రామ్, పాప్‌స్మియర్, రక్త పరీక్షలు, ఉదర భాగం అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, ఈసీజీ వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. రొమ్ములో గడ్డలు వంటి అనుమానాస్పద లక్షణాలను గుర్తించడంతో పాటు అవసరమైన వారికి ఎఫ్ఎన్ఏసీ,కాల్పోస్కోపీ,సర్వైకల్,ఎండ ోమెట్రియల బయాప్సీ వంటి తదుపెరి పరీక్షలు నిర్వహిస్తున్నారు. కుటుంబ నియంత్రణ సేవలు, శస్త్రచికిత్స ఓపీ సేవలు, తదితర సేవలు కూడా అందిస్తున్నారు.లక్షణాలు వచ్చే వరకు ఎందుకు ఆగాలి. క్యాన్సర్ అంటే భయపడటం కాదు.. ముందుగానే గుర్తించడం ముఖ్యం. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించి సకాలంలో చికిత్స తీసుకుంటే ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరుచుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఉద్దేశ్యంతో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ముందస్తు స్క్రీనింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.మామోగ్రామ్, పాప్‌స్మియర్, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షల్లో ఏదైనా అనుమానాస్పద ఫలితం వస్తే అక్కడితో వదిలేయకుండా తదుపరి పరీక్షలకు పంపిస్తున్నారు. అవసరమైన చోట బయాప్సీ, ఎఫ్ఎన్ఏసీ, కాల్పోస్కోపీ వంటి పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. నిర్ధారణ అయిన కేసులకు అవసరమైన చికిత్స కోసం హైదరాబాద్‌తో పాటు ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారు.49 వేలకు పైగా ఓపీ సేవలు ఖమ్మం సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నరేందర్ నిరంతర పర్యవేక్షణ చేస్తూ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా అందుతున్న సేవల గణాంకాలే నిదర్శనం.2023 మార్చి 8 నుంచి 2026 ఆగస్టు 31 వరకు 49,202 ఓపీ సేవలు నమోదయ్యాయి. ఈ కాలంలో 4,900 పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించగా, 264 కేసుల్లో అసాధారణ ఫలితాలు గుర్తించారు. అలాగే 6,102 మామోగ్రామ్ పరీక్షలు నిర్వహించగా, 973 కేసుల్లో అసాధారణ ఫలితాలు నమోదయ్యాయి.ఉదర భాగానికి సంబంధించిన సమస్యలను గుర్తించేందుకు 9,149 అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించారు. వీటిలో 2,872 కేసుల్లో అసాధారణ ఫలితాలు గుర్తించబడ్డాయి.అనుమానాస్పద ఫలితాలను నిర్లక్ష్యం చేయకుండా తదుపరి వైద్య పరీక్షలకు అనుసంధానం చేయడం ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించే ప్రయత్నం కొనసాగుతోంది.పరీక్షలతో ఆగలేదు నిర్ధారణ వరకు తీసుకెళ్లారు.ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రత్యేకత కేవలం స్క్రీనింగ్ నిర్వహించడంలోనే లేదు.పరీక్షల్లో అనుమానాస్పద ఫలితాలు వచ్చిన మహిళలను తదుపరి స్థాయి పరీక్షలు, వైద్య సేవలకు అనుసంధానం చేస్తున్నారు. ఎఫ్ఎన్ఏసీ, కాల్పోస్కోపీ, బయాప్సీ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాల్పోస్కోపీ ద్వారా 245 మందికి సేవలు అందించగా, క్రయోథెరపీ సేవలు 22 మందికి అందించారు. ఇలా ఒక మహిళ ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి పరీక్షలు నిర్వహించడం, అనుమానిత కేసును గుర్తించడం, వ్యాధిని నిర్ధారించడం, అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రానికి పంపించడం, చికిత్స అనంతరం పర్యవేక్షించడం వరకు ఒక సమగ్ర వైద్య వ్యవస్థగా కార్యక్రమం కొనసాగుతున్నది.260 మందిలో క్యాన్సర్ గుర్తింపు,ముందస్తు స్క్రీనింగ్ ఎంత కీలకమో ఖమ్మం జిల్లాలో నమోదైన ఫలితాలు తెలియజేస్తున్నాయి. 2023 మార్చి 8 నుంచి ఇప్పటి వరకు ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మొత్తం 260 మందిలో వివిధ రకాల క్యాన్సర్ లేదా క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాధులు గుర్తించారు. వీరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 95 మంది, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ద్వారా 165 మంది గుర్తించబడ్డారు.గుర్తించిన కేసుల్లో అత్యధికంగా 109 మందిలో రొమ్ము క్యాన్సర్, 82 మందిలో సర్వైకల్ క్యాన్సర్ బయటపడ్డాయి. వీటితో పాటు నోటి క్యాన్సర్, ఉదర భాగానికి సంబంధించిన క్యాన్సర్, అండాశయ మాలిగ్నెన్సీ, జీఈ జంక్షన్ క్యాన్సర్, రెక్టం క్యాన్సర్,ఎండోమెట్రియం క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, కాలేయం,నాలుక,ఎముకలు, ఊపిరితిత్తులు, మూత్రాశయం, గొంతు తదితర ప్రాంతాలకు సంబంధించిన క్యాన్సర్ కేసులు కూడా గుర్తించారు.థైరాయిడ్‌కు సంబంధించిన కేసుల్లో 19 మందిలో క్యాన్సర్ గుర్తించగా, ఫోలిక్యులర్ నియోప్లాజం, పాపిల్లరీ కార్సినోమా వంటి కేసులు కూడా గుర్తించారు. అండాశయ మాలిగ్నెన్సీ, ఇంగ్వైనల్ లింఫ్ నోడ్, సాఫ్ట్ టిష్యూ సార్కోమా, మెటాస్టాసిస్, సర్వైకల్ లింఫ్ నోడ్, వెర్రుకస్ లోయర్ లిప్ వంటి అరుదైన కేసులను కూడా వైద్య బృందాలు గుర్తించాయి. ఎడమ అడ్నెక్సల్ ప్రాంతంలో 7.9 సెంటీమీటర్ల × 6 సెంటీమీటర్ల పరిమాణంలో గాయం గుర్తించిన కేసును కూడా తదుపరి వైద్య సేవలకు అనుసంధానం చేశారు.ఒక్కో కేసుపై ప్రత్యేక శ్రద్ధక్యాన్సర్ నిర్ధారణతో వైద్య సేవలు ముగియడం లేదు. గుర్తించిన ప్రతి కేసును అవసరమైన చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారు. హైదరాబాద్ లో మెరుగైన చికిత్స అవసరమైన వారికి అక్కడి వైద్యసేవలను పొందేలా మార్గనిర్దేశం చేస్తున్నారు. చికిత్స అనంతరం తిరిగి ఫాలో అప్ చేయడం ద్వారా బాధితుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.కీమోథెరపీ, రేడియోథెరపీ వంటి చికిత్సలు పొందుతున్న 260 మంది బాధితులకు క్రమం తప్పకుండా ఫాలోఅప్ సేవలు నిర్వహిస్తున్నారు. చికిత్సలో ఉన్న మహిళలకు అవసరమైన వైద్య సలహాలు, పర్యవేక్షణ అందిస్తూ చికిత్స కొనసాగింపునకు సహకరిస్తున్నారు.పొరుగు జిల్లాల నుంచి వచ్చినా సేవల్లో వెనుకడుగు లేదు.ఖమ్మం ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి మరో నిదర్శనం చుట్టు పక్కల ప్రాంతాలు, పొరుగు జిల్లాల నుంచి కూడా మహిళలు వైద్యం కోసం రావడం. రోగుల సంఖ్య పెరగడంతో పని భారం పెరుగుతున్నప్పటికీ వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్న వనరులతో సేవలను కొనసాగిస్తున్నారు.రోజురోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా సేవలను అందించేందుకు వైద్య బృందాలు సిద్ధంగా ఉంటున్నాయి. వచ్చిన ప్రతి మహిళకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, అనుమానాస్పద కేసులను గుర్తించి, తదుపరి వైద్య సేవలకు అనుసంధానం చేయడంపై దృష్టిసారిస్తున్నారు.కలెక్టర్ పర్యవేక్షణలో.. మరింత చేరువగా ప్రభుత్వ వైద్యం జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ పర్యవేక్షణలో జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించడంపై ప్రత్యేక దృష్టి కొనసాగుతున్నది. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో స్క్రీనింగ్ సేవలు సక్రమంగా అందేలా చూడటంతో పాటు, గుర్తించిన కేసులకు తదుపరి వైద్య సేవలు అందడం, అవసరమైన ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫరల్,చికిత్స అనంతరం ఫాలోఅప్ వంటి అంశాలపై వైద్య విభాగంతో సమన్వయం చేస్తున్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా

ఆరోగ్య అవగాహన పెంపొందించడం కూడా కార్యక్రమంలో ముఖ్య భాగంగా కొనసాగుతోంది.మీ ఆరోగ్యం కోసం రెండు రోజులు మర్చిపోవద్దు.మహిళలు తమ ఆరోగ్య సమస్యలను దాచుకోవడం లేదా నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యాధి ముదిరిన తర్వాత ఆసుపత్రికి వచ్చే పరిస్థితి మారాలి. ఆరోగ్య సమస్య ఉన్నా లేకపోయినా, ముఖ్యంగా 35 సంవత్సరాలు పైబడిన మహిళలు ముందస్తు స్క్రీనింగ్ చేయించుకోవడం అవసరం.ప్రతి మంగళవారం,గురువారం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆరోగ్య మహిళ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. పరీక్షల కోసం కేటాయించే కొద్ది సమయం భవిష్యత్తులో ఎదురయ్యే పెద్ద ఆరోగ్య సమస్యను ముందుగానే గుర్తించేందుకు ఎంతో విలువైనదిగా మారవచ్చు.ఆరోగ్య మహిళ ప్రతి మహిళకు ఒక అవకాశంకుటుంబం కోసం ఎన్నో త్యాగాలు చేసే మహిళ తన ఆరోగ్యం కోసం కూడా కొంత సమయం కేటాయించాలి.నాకు ఏమీ లేదు అని భావించడం కంటే ఒక్కసారి పరీక్ష చేయించుకుందామ్ అనే ఆలోచన ఎంతో ముఖ్యం ఒక సాధారణ పరీక్షలోనే దాగి ఉన్న వ్యాధి బయటపడే అవకాశం ఉంది. ముందే గుర్తిస్తే సకాలంలో చికిత్స పొందే అవకాశం కూడా ఉంటుంది.అందుకే ప్రతి మహిళకు ఒక విజ్ఞప్తి ఆరోగ్యాన్ని వాయిదా వేయకండి, పరీక్షలను నిర్లక్ష్యం చేయకండి. ప్రతి మంగళవారం,గురువారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి. మీ ఆరోగ్యం కోసం మీరు వేసే ఒక్క అడుగు.. మీ కుటుంబ భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తుంది.



# అధిక సాంద్రతలో చాపలు పెంచి అధిక ఆదాయాన్ని పొందాలి

- మత్స్య సహకార సంఘం చిప్ ప్రమోటర్. ఎం వెంకటేశ్వర్లు



**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి**

మత్స్య పరిశోధన స్థానం పాలేరు పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు ఆధ్వర్యంలో భారతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్, వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము న్యూఢిల్లీ ఆర్థిక సహకారంతో తెలంగాణ మత్స్యకారులకు మత్స్య రైతులకు జరుగుతున్న బయోప్లాక్ విధానంలో చేపల సాగు అను అంశం పై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం భాగంగా మొదటి రోజు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎం. వెంకటేశ్వర్లు, మత్స్య సహకార సంఘాల చీప్ ప్రమోటర్ ఖమ్మం జిల్లా మాట్లాడుతూ మత్స్య పరిశోధన స్థానం పాలేరు శాస్త్రవేత్తలు కల్పిస్తున్న బయోఫ్లాక్ ద్వారా చేపల పెంపకం అనే ఈ అధునాతన టెక్నాలజీని మన తెలంగాణ మత్స్య రైతులు మరియు మత్స్యకారులు తప్పకుండా సద్వినియోగ పరుచుకొని అధిక సాంద్రతలో చేపలను పెంచి అధిక ఆదాయాన్ని పొందాలని కోరారు. సహకార సంఘాల పనితీరు ఎన్నిక విధానం గురించి తెలంగాణ మత్స్యకారులకు క్లుప్తంగా వివరించారు. డాక్టర్ ఎం. శ్యాం ప్రసాద్ సీనియర్ మత్స్య శాస్త్రవేత్త అధిపతి మత్స్య పరిశోధన స్థానం పాలేరు మాట్లాడుతూ ఈ మూడు రోజులు ఈ బయోఫ్లాక్ విధానంలో చేపల సాగు అను శిక్షణ కార్యక్రమంలో మా మత్స్య శాస్త్రవేత్తలు రైతులకు ఫ్లాక్ తయారీ, లాభనష్టాలు, ఉపయోగాలు, ఫీడింగు, నీటి నాణ్యత మరియు వ్యాధుల గురించి సంక్షిప్తంగా వివరిస్తారని మరియు క్షేత్రస్థాయిలో బయోఫ్లాక్ విధానాన్ని చూపిస్తారని తెలిపారు. బి. రవీందర్ మత్స్య శాస్త్రవేత్త మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మరియు దేశవ్యాప్తంగా బయోప్లాక్ విధానంలో చేపల సాగు యొక్క స్థితిగతుల గురించి మత్స్యకారులకు మరియు మత్స్య రైతులకు క్లుప్తంగా వివరించారు. బయోఫ్లాక్ సాగు విధానంలో పెంచదగ్గ వివిధ రకాల సాగు చేపల గురించి సంక్షిప్తంగా తెలంగాణ మత్స్య రైతులకు మత్స్యకారులకు వివరించారు. పి. శాంతన్న మత్స్య శాస్త్రవేత్త మాట్లాడుతూ బయో ఫ్లాక్ విధానంలో చేపల సాగు చేపట్టేటప్పుడు స్థల ఎంపిక గురించి ఫ్లాక్ తయారీ కోసం వాడే వివిధ రకాల ముడి పదార్థాలు గురించి, ఫ్లాక్ తయారీలో తీసుకోవలసిన మెలకువల గురించి, మేత యొక్క పోషక విలువలు మేత యాజమాన్యం గురించి మత్స్య రైతులకు సంక్షిప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం వరంగల్ జిల్లా నుంచి మత్స్యకారులు 25 మంది పాల్గొన్నారు.

## అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గా బజ్జూరి రమణారెడ్డి ఎన్నిక



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మంగళవారం హైదరాబాద్ లో చంపాపేట్ ఆడిటోరియం లో జరిగిన అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షులు బ్రహ్మశ్రీ రాజ్ దేశ్ పాండే, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ రాష్ట్రాలైన కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ నుండి ప్రముఖులైన అనేకమంది గురుస్వాములు హాజరై సుదీర్ఘంగా చర్చించి కమిటీ భవిష్యత్ కార్యాచరణ వివిధ రాష్ట్రాల్లో అభివృద్ధి గురించి తదుపరి జాతీయ రాష్ట్ర నాయకుల సమక్షంలో తదుపరి రాష్ట్రాల జిల్లాల నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సీమ నరేందర్ ప్రధాన కార్యదర్శి తాండ రాంప్రసాద్ గురుస్వామి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా నాగ రామాచారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బజ్జూరి రమణారెడ్డి(పాలేరు పీఠం గురుస్వామి)ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరీ ఎన్నిక పట్ల ఖమ్మం జిల్లా కు చెందిన అనేకమంది అయ్యప్ప గురుస్వాములు, అయ్య ప్ప భక్తులు హర్షం వెలిబుచ్చారు.

## సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి వేడుకలు

- నివాళులర్పించిన నాయకులు



**బోనకల్, సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి):** విద్యుత్తు పోరాటయోధుడు, సిపిఎం నాయకుడు సత్తెనపల్లి రామకృష్ణ 26వ వర్ధంతినీ బోనకల్ మండల కేంద్రం లోని మంగళవారం సిపిఎం కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు, జిల్లా మాజీ కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... 2000 సంవత్సరం ఆగస్టు 28వ నా హైదరాబాద్ లోని బషీర్బాగులో జరిగిన విద్యుత్ పోరాటంలో సత్తెనపల్లి రామకృష్ణ పోలీసుల కాల్పులకు గురై తీవ్ర గాయాల పాలై హాస్పటల్లో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 8వ తారీఖున అమరుడయాడని, రామకృష్ణ తోపాటు మరో ఇద్దరు మరణించారని ఆనాటి నుండి ఈనాటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడానికి సాహసం చేయట్లేదని, రామకృష్ణ మరణం విద్యుత్ పోరాటానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, గుగులోతు నరేష్, కొమ్మినేని నాగేశ్వరరావు, దొండపాటి సత్యనారాయణ, చిట్టిమోదు నాగేశ్వరరావు, తెల్లాకుల శ్రీనివాస్, దొప్ప కొరివి వీరభద్రం, డాక్టర్ కొంగర భూషయ్య, ఏసుపోగు బాబు, దుబా భద్రాచలం, మచ్చ గురవయ్య, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, బంక శ్రీను ఉన్నారు.

## సెప్టెంబర్ 10న వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహణ

- జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జ్యోతి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సెప్టెంబర్ 10న ఉదయం 9 గంటలకు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో వీరనారీ చాకలి ఐలమ్మ విగ్రహానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్తులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా బిసి సంక్షేమ అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్ దిష్టి బొమ్మ దగ్ధం

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య అధ్యక్షతన రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు అడపా హారిక నాయుడు,జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్,పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్ ,జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న మరియు శ్రేణులతో కలిసి ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన రాజ్యాంగబద్ధ స్పీకర్ పదవి లో ఉన్న గడ్డం ప్రసాద్ పై శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఈరోజు జిల్లా కాంగ్రెస్ కార్యాలయాలయం నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి తాతా మధుసూదన్ దిష్టి బొమ్మ దగ్ధం చేయనైనది.ఈ సందర్భంగా జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య మాట్లాడుతూ తాతా మధుసూదన్ వ్యాక్యలు దళిత జాతిని బాధించాయని,రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా మాట్లాడటం సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని అటువంటి వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్ శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ఎస్ ఎస్ సెల్ కార్యదర్శి ఆంతోటి సురేష్,జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ,బమ్మిడి శ్రీనివాస్ యాదవ్,జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు కిలారు అనిల్ కుమార్ , కొట్టే రాజశేఖర్,చింతమల్ల రవి కుమార్,దామా స్వరూప ,నాయకులు బిక్షపతి రాథోడ్,ఏలూరి రవికుమార్, లింగాల రవికుమార్,కందుల శ్రీను,జంగాల లక్ష్మీనారాయణ,ఆరెంపుల రామయ్య,కందుకూరి వెంకటనారాయణ, తోళ్ళ రాకేష్,నారపోగు సుదర్శన్,తాళ్ళ వెంకటేశ్వర్లు,పంది రాజు గౌడ్,మెలిక రాజు,బలుసు లక్ష్మీ,ఇటిక్యాల లత, చట్టు మంగ,కవిరాజు,మీసాల నరసింహారావు నాయకులు పాల్గొన్నారు.



## బిజెపి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరం

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు
- సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు




**బోనకల్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలతో భవిష్యత్తులో దేశానికి ప్రమాదకరంగా మారనున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మధిర నియోజకవర్గంలో అధికారం, అభివృద్ధి పేరుతో కొంతమంది మట్టి మాఫియా దారులు రెచ్చిపోతున్నారని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సిపిఎం మండల కమిటీ సభ్యుల శాఖ కార్యదర్శిల సమావేశం జొన్నలగడ్డ సునీత అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ పేద ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని దీనివలన పేద ప్రజలకు ఉపాధి దూరం చేయటమేనన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే చట్టాలను తీసుకువస్తుందని విమర్శించారు. దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించే అనేక విధానాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తుందని ఘాటుగా విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గంలో ప్రభుత్వ గుట్టలను కొంతమంది మాఫియా డాన్లు కొల్లగొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను దోచుకుంటున్న అధికారులు మిన్నకుండిపోతున్నారని విమర్శించారు. అభివృద్ధి పేరుతో కొంతమంది దోచుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. ప్రధానంగా మైనింగ్ అధికారులు నిద్రమత్తులోనే జోగుతున్నారని విమర్శించారు. అభివృద్ధి పేరుతో అక్రమాలు సహిస్తే సిపిఎం సహించదని హెచ్చరించారు. అవసరమైతే ప్రజలను సమీకరించి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సోమవారం ప్రారంభమైన మొట్టమొదటి శాసనసభ సమావేశాలు చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామని అనుమానం కలుగుతుంది అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ రూపంలోనైనా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు బంధం శ్రీనివాసరావు, దొండపాటి సత్యనారాయణ, గుగులోతు నరేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, చిట్టిమోదు నాగేశ్వరరావు,దొప్ప కొరివి వీరభద్రం, కొంగర భూషయ్య, దూబ భద్రాచలం, మచ్చ గురవయ్య, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## గుదిమాల్లలో విజయవంతంగా పశు వైద్య శిబిరం

**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల గ్రామంలో పశువైద్య & పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 28 పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్సలు, 13 పశువులకు సాధారణ పశు వైద్య సేవలు అందించారు. అలాగే 18 దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించారు.ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ పశువైద్యాధికారి డాక్టర్ అనంతు హరీష్ పశువులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది చక్రవర్తి, రామారావు, గోపాలమిత్ర సూపర్వైజర్ నాగేశ్వరరావు, గోపాలమిత్రులు వెంకటేశ్వర్లు, అలీ, శ్రీను, వినయ్ పాల్గొన్నారు.అదేవిధంగా రైతులు పేరం శ్రీనివాస్, అబ్రహం, వెంకయ్య తదితరులు పాల్గొని ఉచిత పశు వైద్య శిబిరం సేవలను వినియోగించుకున్నారు.





# తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్



ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముంద స్తు చర్యలు చేపట్టాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సంబంధిత అధి కారులను ఆదేశించారు. మంగళ వారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో గల ఎన్ఎస్పీ కాల్వ లింక్ కెనాల్ పునరుద్దరణ పను లను ఆయన పరిశీలించారు. సాగర్ కాల్వ నుంచి ఏదులాపురం చెరువుకు నీరు సరఫరా అయ్యే కాల్వ, తూము పునరుద్దరణ పనుల పురోగతిపై మున్సి పల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఇరి గేషన్ అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాల్వ ప్రస్తుత పరిస్థితి, సాగర్ కాల్వ నుంచి చెరువు వరకు ఉన్న దూరం, నీరు సాఫీగా ప్రవ హించేందుకు అవసరమైన పరి స్థితులు తదితర అంశాలను పరిశీలిం చారు. కాల్వ, తూము పునరుద్దరణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి చెరువుకు నీరు చేరేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండల పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ ఆరా తీశారు. నోటీసులు అందుకున్న ఓట ర్లలో ఏ ఒక్కరూ మిస్ కాకుండా ప్రతి ఒక్కరినీ హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఓటర్లకు అందుబాటులోకి తీసుకురా వడానికి కూడా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్నే రు, ఇతర చెరువుల్లో నీటి నిల్వలు తక్కు వగా ఉన్నందున గణేష్ నిమజ్జనం సందర్భంగా ఇబ్బందులు తలెత్త కుండా తక్కువ ఎత్తు గల గణేష్ విగ్రహా లను మండపాలపై ఏర్పాటు చేసుకు నేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ విక్రమ్, పలువురు మున్సిపల్ అధికా రులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సత్యానందం కుటుంబానికి టిడబ్ల్యూ జేఎఫ్ ఆర్థిక సహాయం

- ఆర్థిక సహకారం అందజేసిన జిల్లా బృందం
- సత్యానందం మృతి చెందడం బాధాకరం
- సత్యానందం కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి
- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖదీర్



బోనకల్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి): మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన విజన్ ఆంధ్ర విలేకరి మంద సత్యానందం కుటుంబా నికి టీ డబ్ల్యూ జేఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వ సాగర్, జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు అన్నారు. టి డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన నగదును గోవిందాపురం ఎల్ గ్రామంలో సత్యానందం భార్య సుమంత్ కు మంగళవారం వారు అందజే శారు. సత్యానందం చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. మంద సత్యానందం రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం బాధాకరం అన్నారు. సత్యానందం ముగ్గురు పిల్లలకు చదువులో అవసరమైన పూర్తి సహ కారం యూనియన్ తరపున అందిస్తామన్నారు. ఇల్లు లేని సత్యానందం భార్యకు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు అధికా రులను కోరారు. ఇందిరమ్మ ఇల్లు కోసం అవసరమైతే జిల్లా కలెక్టర్ ను కలిసి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. మండల అధికారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యానందం వృత్తిలో ఎంతో చురుకుగా ఉండేవాడు అన్నారు. భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించవలసిన సత్యానందం రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం మమ్మ లను కలవరపాటుకు గురిచేసింది అన్నారు. యూనియన్ తరపున కుటుంబా నికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా నాయకులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, మండల నాయకులు జక్కుల రామారావు మాగి ముఖేష్, తెల్లబోయిన సుమన్, సర్పంచ్ మంద కరుణ, తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ పై దూషణలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్షమాపణ చెప్పాలి

- దిష్టి బొమ్మ దగ్ధం చేసిన వేంసూర్ మండల కాంగ్రెస్



వేంసూరు సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వేంసూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. మండలంలోని మర్లపాడు సెంటర్ ప్రధాన కూడలిలో బీఆర్ఎస్ నాయ కుల వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చ కాయల సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా తప్పుబట్టారు. ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వేంసూర్ మండల కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండి స్తున్నట్లు తెలిపారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను అసభ్యకర మైన పదజాలంతో దుర్భాషలాడటం సరికాదని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రాంగ ణంలో పోలీసులపై దాడికి పాల్పడిన ఘటన కూడా బాధాకరమని, ప్రజాప్రతి నిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంటనే క్షమా పణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం లో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్ సభ్యత్వం రద్దు చేయాలి

- దళిత నాయకులు. కొమ్ము ప్రసాద్



పాలేరు ఆర్. సీ సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను దళిత నాయకులు కొమ్ము ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌పై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ప్రజా స్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను అవమా నించడమేనని అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రతీ కగా ఉన్న స్పీకర్ పదవిని ప్రతి ప్రజాప్రతినిధి గౌర వించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీఆ ర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన శిక్షణ ఇదేనా? అని కొమ్ము ప్రసాద్ ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న తాతా మధుసూ దన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమాజం హర్షించదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనుచిత భాషకు బ్రాండ్ అంబాసిడర్‌గా తాతా మధుసూదన్ వ్యవహరిస్తున్నారని విమర్శిస్తూ, ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతా మధుసూదన్ వ్యాఖ్యలు దళిత సమాజాన్ని కూడా తీవ్రంగా బాధిం చాయని దళిత స్పీకర్ పై మాట్లాడిన తీరుకు క్షమాపణ చెప్పకపోతే దళితుల సత్తా ఏందో చూపిస్తామని కొమ్ము ప్రసాద్ అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తా నని హామీ ఇచ్చి మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబిం చిందని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలను ఉపేక్షిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవుల గౌరవం దెబ్బతింటుందని, తాతా మధుసూదన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## వేంసూరు ఎస్సై పల్లెల ప్రదీప్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ప్రజాజ్యోతి విలేకర్ బోయ ప్రసాద్



వేంసూరు సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల పోలీస్ ఎస్ఐగా ఇటీవల సత్తుపల్లి నుంచి బది లీపై చేరిన పల్లెల ప్రదీప్‌కు మండల, ప్రజాజ్యోతి జర్నలిస్ట్ బోయ ప్రసాద్ మంగళవారం అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జర్నలి స్టులు ఎస్ఐ పల్లెల ప్రదీప్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్ష ణతో పాటు ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలని ఈ సంద ర్భంగా ఆకాంక్షించారు. ఎస్ఐ పల్లెల ప్రదీప్ కూడా జర్నలిస్టులకు ధన్యవా దాలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## రణభేరి ర్యాలీ కి భారీగా తరలిన భరణిపాడు బి ఆర్ ఎస్ కార్యకర్తలు



వేంసూర్ సెప్టెంబర్ 8 ప్రజాజ్యోతి వేంసూరు మండలం లో మంగళవారం జరి గిన బి ఆర్ ఎస్ రణభేరి ర్యాలీ కి భరణిపాడు గ్రామం నుండి కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయ డంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైనది అలాగే అసెంబ్లీ సమావేశంలో పోలీస్ లు బి ఆర్ ఎస్ శాసన సభ్యులు హరీష్ రావు సబితా ఇంద్రారెడ్డి ని అవమానించా రని దానికి నిరసనగా భరణిపాడు బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మందపాటి మహేశ్వరరెడ్డి మరియు మందపాటి వెంకటరెడ్డి అధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ర్యాలీ నిరసనకు పెద్ద ఎత్తున తరలి వెళ్ళటం జరిగింది

## అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

- కల్లూరు లో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ




కల్లూరు, సెప్టెంబర్ 08: ప్రజా జ్యోతి అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్లూరు మండలంలో మంగళవారం విద్యాశాఖ సెర్ప్ ఆధ్వ ర్యంలో అక్షరాస్యత పై అవగాహన ర్యాలీ నిర్వహించారు మండల పరిషత్ కా ర్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఎంపీడీవో, మండల విద్యాశాఖ అధి కారి, ఏపిఎం ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాల విద్యార్థులు సెర్ప్ సిబ్బంది క మ్యూనిటీ కోఆర్డినేటర్లు స్వయం సహాయక సంఘాల సభ్యులు మెప్మా సభ్యులు పాల్గొన్నారు. అక్షరాస్యత ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి అక్షరాస్యులుగా మారాలని విద్య ద్వారానే సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ డీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, విద్యాశాఖ అధి కారి పద్మ, ఏపిఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న కూసుమంచి

- దళిత ఆగ్రహ జ్వాలల్లో బీఆర్.ఎస్ దహనం!
- దళిత నేతపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీ.ఆర్.ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ దిష్టిబొమ్మ దహనం.
- అంబేద్కర్ విగ్రహానికి పాలతో శుద్ధి.
- కుసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి





**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న దళిత నేతపై బీ.ఆర్.ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసూదన్ చేసిన అనుచిత,అవమానకరమైన వ్యాఖ్యలకు నిరసనగా కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కూసుమంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ భీమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించే అహంకార రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ సహించరు అని రాజ్యాంగాన్ని అవమానిస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని సందర్భంగా వారు తెలిపారు.కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధమైన పదవి అని అన్నారు. ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతంగా దూషణలు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం అహంకారానికి పరాకాష్ట అని, ప్రజాస్వామ్య సంప్రదాయాలను అవమానించడమేనని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదాసు ఉపేందర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై అసెంబ్లీలో చర్చకు రావాలని పిలుపునిస్తే చర్చకు రాకుండా, దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం, పోలీసులతో వాగ్వాదానికి దిగడం, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని కించపరిచేలా మాట్లాడటం అత్యంత సిగ్గుచేటని ఆయన అన్నారు.నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి. లేదంటే బర్తరఫ్ చేయాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవికుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఉండి రాజ్యాంగబద్ధ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధు నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మండల మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిని అవమానించే విధంగా మాట్లాడిన వ్యక్తి ప్రజాప్రతినిధిగా కొనసాగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. తాతా మధుపై శాసనసభ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు బోడ వీరు నాయక్ మాట్లాడుతూ తాతా మధు తన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ కి, తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి హాఫీజుద్దీన్ మాట్లాడుతూ రాజకీయ విభేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించుకోవాలని, అయితే రాజ్యాంగ సంస్థలు, రాజ్యాంగబద్ధ పదవులను అవమానించేలా మాట్లాడటాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన తెలిపారు.అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పాలతో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. దళిత మహానేతను అవమానించే భావజాలాన్ని ప్రజలు ఎప్పటికీ సహించరని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, కూసుమంచి మండల మాజీ ఎంపీపీలు జూకురి. గోపాలరావు బానోత్ శ్రీనివాస్ నాయక్, డిసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హాఫీజుద్దీన్, డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు మంకెన వాసు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురేష్, జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, మాదాసు ఉపేందర్, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, కంచర్ల జీవన్ రెడ్డి, కంచర్ల పవన్ రెడ్డి, కేశవ రెడ్డి, రామారావు, రమేష్‌రెడ్డి, అంబాల లింగయ్య, భారీ వీరభద్రం, జనార్దన్ గౌడ్, చాట్ల పరశురాం,సర్పంచులు సర్పంచుల సంఘం అధ్యక్షులు బోడా వీరు నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు కొండా కృష్ణవేణి --మహిపాల్, గంగా స్రవంత్రి-- రవి, మల్లెల స్వాతి-- ఉపేందర్ ,వడిత్య వెంకటేష్ నాయక్,, బాదావత్ నరేష్,, గురుమూర్తి, నూకల శోభన్ బాబు, హాలవత్.వీరన్న, బుర్ర కృష్ణ, కలికిని శ్రీలత, తెల్లమక్కల భవిత, మేడేపల్లి విజయ, బూక్య సావిత్రి, లోడిగా నీలకంత, కంచర్ల సైదమ్మ, బానోతు నాగేశ్వర రావు ,బానోతు సరస్వతి, కందుకనూరి మంగమ్మ, అయిత గాని వెంకటరమణ, అశోక్ ,బోంగ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ విగ్రహాలు పెట్టేవారు పూర్తి సమాచారము ఇవ్వండి

- భద్రత కల్పిస్తాం -ఎస్సై ప్రదీప్



**వేంసూరు సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** మండలంలో వినాయకుడి విగ్రహాలు మరియు మండపాలు ఏర్పాటు చేసేవారు కచ్చితంగా పూర్తి సమాచారాన్ని పోలీసు వారికి తెలియపరచాలని మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్సై ప్రదీప్ తెలిపారు మండలంలో ఈ సంవత్సరం చాలామంది విగ్రహాలకు పెట్టడానికి అనుమతి కోరారు దాదాపుగా 90 పైన విగ్రహాలకు అనుమతులు మంజూరు చేయటానికి సిద్ధంగా ఉన్నాము మరో ముఖ్యంగా విగ్రహాలు ఏర్పాటు చేసేవారు వారు మండపాలు పెట్టే స్థలాన్ని ప్రభుత్వ స్థలం మరియు ప్రైవేట్ స్థలమో పూర్తి సమాచారం ఇవ్వాలని అలాగే విగ్రహం యొక్క సైజుని అలాగే నిమగ్నం చేసే ప్రదేశాలు ఎన్ని రోజులు మండపాలలో ఉంచుతున్నారు ప్రతిదీ కూడా పోలీసు వారికి సమాచారాలు ఇవ్వాలని చెప్పారు కరెంట్ పర్మిషన్ సౌండ్ పర్మిషన్ ప్రతిది కూడా తీసుకుని తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈ యొక్క కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేయాలని వేంసూరు మండలంలో ఎటువంటి అవాంఛిత సంఘటన జరగకుండా కాపాడటానికి మేము శాంతి భద్రతలో విషయంలో అందరికీ భద్రత కల్పిస్తామని దయచేసి ప్రతి ఒక్కరు కూడా మండపాలు ఏర్పాటు చేసేవారు ఖచ్చితమైన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని ఈరోజు మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎస్సై ప్రదీప్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**బోనకల్, సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి ):**రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బోనకల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోనిష కలకోట గ్రామ శివారులోని సోమవారం రాత్రి ఈ రోడ్డు ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనలో కలకోట గ్రామానికి చెందిన అబ్బూరి గోపి (30) సిరిపురం నుండి తన స్వగ్రామం కలకోటకు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా రోడ్డుపై నిలిచి ఉన్న టిప్పర్ వెనుక భాగాన్ని ఢీకొట్టటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గోపికి తలకు చాతి, ముఖ భాగంలో తీవ్రమైన గాయాలు కావడంతో వెంటనే స్థానికులు 108 కి సమాచారం అందించారు. 108 సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం గోపి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు బోనకల్ పోలీస్ స్టేషన్లో 106/1 బి.ఎన్.ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోనకల్ ఎస్ఐ మాచినేని రవి తెలిపారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలి

- దళిత స్పీకర్‌ను అవమానించడం అతని అహంకారానికి పరాకాష్ట
- బీఆర్ఎస్ నేతల నోటి దురుసుకు ప్రజలే సమాధానం చెబుతారు



**మధిర సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మధిర మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయన్నును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సభా గౌరవాన్ని, రాజ్యాంగబద్ధమైన పదవిని అవమానించేలా మాట్లాడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.దళిత సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ రావు పై ఇంతటి నోటి దురుసుతో మాట్లాడటం తాతా మధు అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవాన్ని గౌరవించకుండా అవమానకరంగా మాట్లాడే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.దళిత నాయకుడి పై నోరు పారేసుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. స్పీకర్ పదవిని అవమానించినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలి. శాసనసభ గౌరవాన్ని కాపాడేందుకు వెంటనే సస్పెండ్ చేయాలి” అని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయినా అహంకారం మాత్రం ఇంకా పోలేదని, పదవి పోయిన బాధతో రాజ్యాంగబద్ధమైన పదవులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు.స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పే వరకు తాతా మధు ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాతా మధు పై కఠిన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.స్పీకర్ గౌరవం అంటే రాజ్యాంగ గౌరవం.. దళితుల ఆత్మగౌరవం అంటే తెలంగాణ ఆత్మగౌరవం. దానిని అవమానించే ఆయన ను వెంటనే సస్పెండ్ చేయాల్సిందే! అని కాంగ్రెస్ నాయకులుడిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు జిల్లా సెక్రటరీ పులిబండ్ల చిట్టిబాబు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుమాటి నవీన్ రెడ్డి, కౌన్సిలర్లు బాణావత్ వెంకటరమణ నాయక్ బెజ్జం రాజు, దార నాగార్జున కాంగ్రెస్ పార్టీ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు దేవి శెట్టి రంగారావు మువ్వ వెంకయ్య బాబు పత్తిపరపు సంగయ్య సామినేని రామనాథం బిట్రా ఉద్దండయ్యా ఆదూరి శీను మోదుగు బాబు యూత్ కాంగ్రెస్ నాయకులు సాలిక సురేష్ గద్దల రాజా, గౌసుద్దీన్ మరియు వివిధ హోదాలలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.